ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

3

శనివారం 22 జూన్ 2024

క్రీడలతో అంతర్జాతీయస్థాయి గుర్తింపు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 21: క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎదులాబాద్‌లో శుక్రవారం మర్రిపల్లిగూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాయ నరేశ్, నాయకులు చిలుగూరి లక్ష్మన్, శివరాత్రి వెంకటేష్, మేకల సాయికుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తొలకరి కలవరం

అవసరం లేనప్పుడు తన ప్రతాపాన్ని చూపిన వరుణుడు.. అవసరమైనప్పుడు మాత్రం ముఖం చాటేశాడు. పంటలు చేతికందే దశలో వరుస వర్షాలతో రైతులు ఆగమాగమయ్యారు. తీరా ఇప్పుడు వానాకాలం పంటలు సాగు చేసుకుందామనుకుంటే చినుకు లేక దిక్కులు చూస్తున్నారు. ఇటీవల కురిసిన అడపాదడపా వానలకు రైతులు దుక్కులు దున్నుకొని సాగుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కొందరు పత్తి, జొన్న విత్తనాలు వేశారు. గట్టి వాన పడితే విత్తనాలు వేద్దామనుకున్నారు మరికొందరు. అయితే, వానదేవుడు ముఖం చాటేయడంతో ఇప్పటికే అక్కడక్కడా మొలిచిన మొలకలు కూడా వాడిపోతున్నాయి.

- దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్న రైతులు
- అక్కడక్కడా విత్తిన విత్తనాలు
- ఎండలకు వాడిపోతున్న వైనం
- జిల్లాలో అలముకున్న కరువు మేఘాలు
- ఆందోళనలో రైతులు



కందుకూరు మండలం కొత్తగూడలో ఎండిపోతున్న జొన్న పంట

జాడలేని తొలకరి!

సాధారణంగా తొలకరి వర్షాలు కురిస్తే జూన్ మొదటి వారం నుంచి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఆరుతడి, మొట్ట పంటల సాగు ఆరంభమవుతుంది. కానీ రెండోవారం వరకూ వాన జాడ లేకపోగా, మరో వారం వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సాధారణంగా మే చివరి వారంలో కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని విత్తునాలు వేస్తారు. కానీ.. జూన్‌లో కూడా వర్షాలు లేక పత్తితో పాటు పెసర, కంది, మొక్కజొన్న పంటల సాగు ఆలస్యం జరుగుతోంది.



చౌదరిగూడ మండలం గుర్రంపల్లి శివారులో మొలక దశలోనే ఎండిపోతున్న పత్తి

పరిగి, జూన్ 21: మృగశిర కార్తెతో వర్షాకాలం ప్రారంభమై వాతావరణమంతా చల్లబడుతుందని ఆశించిన రైతులు వరుణుడి కోసం ఎదురు చూడక తప్పడం లేదు. జూన్ మొదటి వారంలోనే తొలకరి పలకరించినప్పటికీ నైరుతి రుతుపవనాలు అలస్యంతో రెండు వారాలనుంచి ఒక్క వర్షం కూడా పడక పోవడంతో ఖరీఫ్ సీజన్ వెనక్కి వెళ్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులవుతున్నా చినుకు కోసం రైతన్న ఆకాశం వైపు ఆశగా ఎదురు చూడాల్సి వస్తోంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఒక్క పెద్ద వర్షమూ రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా మేఘాలు ఊరిస్తూ చిరు జల్లులకే పరిమితమవుతోంది. పూర్తిస్థాయిలో విత్తనాలు విత్తుకునేందుకు సరిపడా వర్షం కురవడం లేదు. ఇప్పటికే రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 4,45,464 ఎకరాలు వివిధ రకాల పంటలు వేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. భూమిలో తడి లేకుండా విత్తులు విత్తుకోవద్దని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అక్కడక్కడా కురిసిన వర్షాలకు 50 శాతం విత్తనాలు విత్తుకున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తుంది. వికారాబాద్ జిల్లాలో వివిధ రకాల పంటలు కలిపి మొత్తం 5,97,830 ఎకరాల్లో సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. గత ఏడాది వానాకాలంలో సాగు చేసిన పత్తి, కంది, మొక్కజొన్న పంటలు ఈసారి ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో పది శాతం విత్తనాలు విత్తలేదు. మృగశిర కార్తె వచ్చి 15 రోజులు గడిచినా వర్షాలు కురియకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జూన్‌లో నమోదైన వర్షపాతం వివరాలు (మి.మీలలో)

జిల్లా	సాధారణం	కురిసింది	లోటు
రంగారెడ్డి	94.0	68.5	- 27.1
వికారాబాద్	91.1	105.4	+ 44.3

సీజన్ ప్రారంభమైనా జాడలేని వర్షాలు

ముందు నాటిన విత్తనాలు మొలకెత్తేనా?

రైతులు జూన్ మొదటి వారం నుంచి పత్తి విత్తనాలు విత్తారు. సుమారు 20 రోజులు గడిచినా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అరకొర వర్షం కురిసినా అధిక ఉష్ణోగ్రతల కారణంగా అవి మొలకెత్తే అవకాశం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏప్రిల్, మేలలో అకాల వర్షాలు కురియడంతో రైతులు ముందుగానే దుక్కులు సిద్ధం చేసుకున్నారు. విత్తులు నాటి తొలకరి వర్షం కురియగానే మొలకెత్తుతాయని ఆశించిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి. భూమిలో వేసిన విత్తనాలు ఎండిపోవడంతో మళ్లీ విత్తనాలు విత్తుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అధిక దిగుబడినిచ్చే పేరున్న కంపెనీల విత్తనాలు రైతులు అధిక ధర చెల్లించి కొనుగోలు చేశారు. విత్తులు దుక్కుల్లోనే ఎండి పోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. వికారాబాద్ జిల్లాలో ఈనెలలో అధిక వర్షంపాతం కురిసినా అది కొన్ని ప్రాంతాల్లోనే కురిసింది. మిగతా చోట్ల మొలకెత్తిన మొక్కలు వాడిపోతున్నాయి.



పూడూరు మండలం రాకంచర్లలో మొలకెత్తని మొక్కజొన్న పంట

దుక్కులు దున్ని ఎదుచూస్తున్నం



గత ఏడాది ఇప్పటికే విత్తనాలు విత్తాం. ఈసారి ఇప్పటి వరకు వర్షం కురియలేదు. దుక్కులు దున్ని వరుణదేవుడి కోసం ఎదురు చూస్తున్నం. చెలక పొలంలో అయితే ఇప్పటికే గడువు దాటింది. నల్లరేగడి నేలల్లో అయితే ఇంకా విత్తనాల విత్తేందుకు అవకాశం ఉంది. వాన కోసం దేవుడిని ప్రార్థిస్తున్నం.

-గోలినాయక్: రైతు, పరిగి

మళ్లీ దున్ని పంట వేయాల్సి వచ్చింది



తొలకరి వర్షాలకు మూడెకరాల్లో జొన్న, కంది విత్తనాలు వేశాను. మొలకలు ఎదుగుతున్న దశలోనే ఎండలు ముదిరాయి. వర్షాలు పడకపోవడంతో మొలకలు వాడుతున్నాయి. రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి విత్తనాలు వేశాను. ఇప్పుడు అవి ఎండిపోయాయి. దీంతో మొత్తం దున్ని మళ్లీ పంట వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బొక్క రాజేందర్‌రెడ్డి, కొత్తగూడ, కందుకూరు మండలం

2024 వానాకాలం సాగు ప్రణాళిక ప్రకారం (ఎకరాల్లో)

జిల్లా	రంగారెడ్డి	వికారాబాద్
పంటలు	సాగు అంచనా	
వరి	1,38,187	1,10,000
జొన్న	3,361	2,504
మొక్కజొన్న	66,530	50,450
పెసలు	48	13,000
కందులు	11,584	1.50,000
పత్తి	1,76,174	2,63,500
మినుములు	34	5000
వేరుశనగ	550	500
ఆముదం	37	20
ఇతర పంటలు	48,959	2,880

వేసిన విత్తనాలు భూమిలోనే మాడిపోయాయి



ఈ సారి 25 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. అధిక ధర, నాణ్యమైన విత్తనాలైన రేవంత్ రకం పత్తి విత్తనాలు వేశాను. ఎకరానికి రూ.12 వేలకు పైనే ఖర్చు చేశాను. వర్షాలు లేకపోవడంతో వేసిన విత్తనాలు భూమిలోనే మాడిపోయాయి. మళ్లీ విత్తులు వేసుకునేందుకు డబ్బులు లేవు. పంట పెట్టుబడి కోసం మరోసారి అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి రైతులకు 90శాతం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను అందించాలి.

- గంగాపురం లక్ష్మారెడ్డి, లాలాపేట్, కొందుర్గు మండలం

భూమి 15-20 సెంటిమీటర్ల లోతు తడిసినప్పుడే విత్తుకోవాలి



భూమి 15-20 సెంటిమీటర్ల లోతు వరకు తడిసినప్పుడే విత్తనాలు వేసుకోవాలి. తేలిక పాటి నేలలకు 50-60 సెంటీమీటర్లు, బరువు నేలల్లో 60-75 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైతే విత్తులు విత్తుకోవాలి. జూన్ 20 వరకు విత్తునాలు వేసుకోవచ్చు. వరి పంట దీర్ఘకాలిక, మధ్యకాలిక రకాలు ఆగస్టు వరకు నాటుకోవచ్చు. వర్షాధార పంటలైన కంది, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలు నాగలి సాలు వచ్చేంత తడి ఉండాలి. అప్పుడు విత్తుకుంటే మంచిది.

-గీతారెడ్డి, రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి

ఘనంగా ఏరువాక పౌర్ణమి



ధారూరు: అవుసుపల్లిలో అలంకరించిన ఎద్దులు

వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో రైతులు ఏరువాక పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఎడ్లకు స్నానాలు చేయించి అలంకరించారు. ఉల్లిగడ్డ, పచ్చిపసుపు తదితర వాటిని ఒక చోట కలిపి దంచి ఎడ్లకు తినిపించారు. అనంతరం రైతులు పొలాల్లో పూజలు నిర్వహించారు. సాయంత్రం కాగానే డప్పు చప్పుళ్ల నడుమ ఎడ్లబండ్లతో దేవాలయాల నుంచి ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. - తాండూరు, జూన్ 21



పెద్దేముల్ : కంకల్‌లో ఎడ్ల బండ్లతో రైతుల ప్రదక్షిణలు

గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

వికారాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపుతామని వికారాబాద్ జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయంలో ఆయన జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి విఘాతం కలగకుండా పనిచేస్తామని, మహిళా, శిశు సంరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. నేరాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా ప్రజలకు పోలీసు యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ఎవరికి పోలీసు సహాయం అవసరమైనా పోలీసు అధికారులను నేరుగా సంప్రదించాలని, లేదా డయల్ 100కు కాల్ చేయాలని ఆయన సూచించారు. ఒడిశా నుంచి హైదరాబాద్, వికారాబాద్‌ల మీదుగా కర్ణాటకకు నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అక్రమంగా సరఫరా చేస్తున్న వారిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటాం
- జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డి

గంజాయి, డ్రగ్స్ స్మగ్లర్లు తమ తీరు మార్చుకోకపోతే వారిపై ఉక్కు పాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారి లేదా వ్యాపారం చేసే వ్యక్తుల సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు.

ఎస్పీకి ఘన స్వాగతం ..

జిల్లా ఎస్పీగా కొత్తగా బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన కె.నారాయణరెడ్డికి అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి, మురళీధర్, ఇతర పోలీసు అధికారులు ఘనస్వాగతం పలికారు. సాయుధ పోలీసు దళం నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎస్పీగా నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వికారాబాద్, పరిగి, తాండూరు డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, కరుణాసాగర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, జిల్లా వర్టికల్ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

అనంతపద్మనాభుడిని దర్శించుకున్న ఎస్పీ

జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీరించిన కె.నారాయణ రెడ్డి కుటుంబసమేతంగా అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి వస్త్రాలను బహుకరించి ఆశీర్వచనం అందజేశారు.



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

బాధ్యతలు చేపట్టిన కొత్త డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్ టౌన్ : మేడ్చల్ కొత్త డీసీపీగా నంద్యాల కోటిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ డీసీపీగా విధులు నిర్వహించిన లిఖితపంత్ కరీంనగర్‌కు బదిలీ కాగా ఆమె స్థానంలో వికారాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహించిన కోటిరెడ్డి మేడ్చల్ డీసీపీగా బదిలీపై వచ్చారు. కాగా చార్జి తీసుకున్న మొదటి రోజు డీసీపీ కోటిరెడ్డి దొంగల దాడికి గురైన మేడ్చల్ పట్టణంలోని జగదాంబ జువేలరీ షాపు పరిస్థితులను సమీక్షించారు. దుండగుల దాడికి పాల్పడిన వివరాలను స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరి

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూన్ 21 : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ రోజు ఉదయం యోగా తప్పని సరిగా చేయాలని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో యోగ దినోత్సవం సందర్భంగా యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ఆరోగ్యంతో పాటు శారీరక మానసిక ఒత్తిడిని కూడా తగ్గిస్తుందని తెలిపారు.



యువత ఆసక్తి కనబరచాలి


మేడ్చల్ టౌన్ : ఆరోగ్యంగా ఉండదలచిన వారు రుషులు, మునులు చూపిన యోగా ఆసనాలను అనుసరించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్‌లో పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఈటల ఆసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ...యోగా మానసిక శారీరక దృఢత్వాన్ని కల్గిస్తుందన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో ...

మేడ్చల్(ఆంధ్రజ్యోతి) : శారీరక, మానసిక , ఆధ్యాత్మిక శ్రేయస్సుకు యోగా ఒక మార్గమని, ఆరోగ్యకరమైన జీవితం కోసం జీవనశైలిలో మార్పు కోసం ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను అంతర్భాగంగా స్వీకరించాలని జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ కలెక్టరేట్ వద్ద యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్, వైద్యులు సంధ్యారాణి, సరస్వతి, గీత ప్రసాద్, మంజుల రాజేశ్వర్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు. వైద్యఆరోగ్య శాఖలోని అన్ని పీహెచ్‌ఎస్‌లు, సూపర్ వైజర్లు, ఆశాలు పాల్గొని ఆసనాలు వేశారు.




మేడ్చల్ కలెక్టరేట్‌లో ..









సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ధారూరు, జూన్ 21: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్తు కార్యనిర్వహణ అధికారి(సీఈవో) యం. సుధీర్ తెలిపారు. మండల పరిషత్తు కార్యాయలంలో శుక్రవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు సీజనల్ వ్యాధుల పై సమన్వయంతో పనిచేయాలని ప్రజలకు వ్యాధులు ప్రబలకుండ చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. పంచాయతీల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నర్సింహులు, ఈజీఎస్ ఏపీవో సురేష్, ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎం పండరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే


తాండూరు సమస్యలపై డిప్యూటీ సీఎంకు విన్నవిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు, జూన్ 21: తెలంగాణ ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఉప ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై విన్నవించారు. తాండూరు ప్రాంతం పూర్తిగా వెనుకబడిందని ఈప్రాంతంలో సాగు, తాగునీటికి సంబంధించి చాలా సమస్యలు ఉన్నాయని వాటికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డిప్యూటీ సీఎంను కోరారు. పలు సమస్యలపై డిప్యూటీ సీఎంకు వినతిపత్రాన్ని అందజేసినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి, నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

బషీరాబాద్ జూనియర్ కళాశాలకు పోస్టులు మంజూరు చేయాలి

మండల కేంద్రం బషీరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భనవం, కళాశాల టిచింగ్, నాన్ టిచింగ్ పోస్టులను మంజూరు చేయాలని ఉన్నత విద్యామండలి ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో ముఖ్య కార్యదర్శిని కలిసి బషీరాబాద్ జూనియర్ కళాశాల పూర్తి స్థాయి అభివృద్దిపై చర్చించారు.

బాధిత కుటుంబానికి 2.50 లక్షల ఎల్‌వోసీ అందజేత

బషీరాబాద్: కంసాన్‌పల్లి(ఎం) గ్రామానికి చెందిన ఈడిగి రాములు గౌడ్ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ అనురాధవెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.







27మంది ఎస్ఐల బదిలీ

మేడ్చల్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 27మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. మేడ్చల్ ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, చేవెళ్ల, శామీర్‌పేటకు చెందిన వి.చంద్రశేఖర్ సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. ఆర్‌జీఐ ఏయిర్‌పోర్టు జి.మనియామ్ కేపీహెచ్‌బీ, కేపీహెచ్‌బీ పీఎస్‌కు చెందిన కె.సత్యనారాయణ మైలార్ దేవ్‌పల్లికి, అత్తాపూర్ పీఎస్‌కు చెందిన కె.నాగరాజు, రాయ్‌దుర్గం ట్రాఫిక్ ,బాలానగర్ పీఎస్‌కు చెందిన అశోక్ లిగెపల్లి అత్తాపూర్‌కు, రాజేంద్రనగర్ పీఎస్‌కు చెందిన పి.రవికిరణ్ ఎస్ఓటీ బాలానగర్ జోన్‌కు, స్పెషల్ బ్రాంచుకు చెందిన షేక్ ముమ్తాజ్ అహెమద్ సీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. సీపీవో సైబరాబాద్, ఆర్‌జీఐఏ ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న టి.వెంకటేశ్వరావును మాదాపూర్ ట్రాఫిక్, ఆర్‌జీఐఏ పీస్‌కు చెందిన ఆర్.పరుశురాం మేడ్చల్ ట్రాఫిక్ పీఎస్‌కు, సనత్‌నగర్ పీఎస్‌కు చెందిన జె.సుశీలను షాద్‌నగర్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా సీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఆర్.మౌనిక పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు, కేపీహెచ్‌బీ ట్రాఫిక్‌కు చెందిన జి.శశిధర్ ఐటీ సెల్ సీపీఏ సైబరాబాద్‌కు, ఐటీ సెట్ సైబరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న సయ్యద్ నజీర్ మియాన్, ఐటీసెల్ సైబరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఈ.రూప కేపీహెచ్‌బీకి బదిలీ అయ్యారు. గచ్చిబౌలి ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ.కృష్ణను మైలార్‌దేవ్‌పల్లి, చేవెళ్ల నుంచి ఆర్.వీరబ్రహ్మాన్‌ను గచ్చిబౌలి ట్రాఫిక్, మైలార్‌దేవ్‌పల్లి నుంచి నఈమ్ హుస్సేన్‌ను కేపీహెచ్‌బీ ట్రాఫిక్, సీసీఆర్‌బీకి చెందిన కె.రాజేశ్వర్ రెడ్డి మియాపూర్, మేడ్చల్ పీఎస్‌కు చెందిన నర్సింహాగౌడ్ సీసీఎస్ మాదాపూర్, సీసీఎస్ మేడ్చల్‌కు చెందిన జి.పోచయ్య మేడ్చల్ పీఎస్‌కు, మియాపూర్ పీఎస్‌కు చెందిన ఎం.రాజు సీసీఎస్ బాలానగర్ జోన్, పేట్‌బషీరాబాద్‌కు చెందిన జి.సరిత కేపీహెచ్‌బీ ట్రాఫిక్, సీసీఎస్ బాలానగర్‌కు చెందిన దాసరి బాల్‌రాజ్ ఎస్‌వోటీ మాదాపూర్ జోన్, ఎస్‌వోటీ మాదాపూర్ జోన్ నుంచి బి.నర్సింహారెడ్డి మియాపూర్‌కు, ఎస్‌వోటీ బాలానగర్ జోన్ నుంచి మామిడి కిషోర్ రాజేంద్రనగర్‌కు, రాయ్‌దుర్గం ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న మలావత్ పరుషరామ్ శామీఆర్‌పేట్ పీఎస్‌కు బదిలీ చేస్తూ సైబరాబాద్ సీపీ ఆదేశాలు జారీ చేశారు.

ఆయిల్‌పామ్ సాగుకు రాయితీలు

- ఆయిల్ ఉత్పత్తులను పెంచేందుకు ప్రత్యేక దృష్టి
- ఉద్యావన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లహరి, సత్తార్

తాండూరు, మే 21 : ఆయిల్ ఫామ్ సాగు ద్వారా నూనె ఉత్పత్తులు పెంచుకోవాలని భారీ సబ్సిడీతో ప్రభుత్వం, కంపెనీలు ముందుకు వస్తున్నాయని ఉద్యావన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లహరి అన్నారు. శుక్రవారం తాండూరు బాలాజీ మందిర్ హాల్‌లో ఉద్యాన ఇకోఫామ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో అయిల్‌ఫామ్ సాగుపై జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ఈ ఈ సందర్భంగా విదేశాల నుంచి 73 లక్షల టన్నుల వంట నూనెను దిగుమతి చేసుకుంటున్నామని, మనమే విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వం, కంపెనీ , రైతుల భాగస్వామ్య ఒప్పందంతో ఈపంట సాగును పెంచనున్నట్లు, పంటసాగుకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, చిన్నసన్న కారు రైతులకు 80శాతం, బడా రైతులకు 70శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇండోనేషియా శాస్త్రవేత్త విజయాన్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు అవసరమైన క్షేత్ర సిబ్బంది ద్వారా సాంకేతిక సలహాలు ఇవ్వడం జరుగుతుందని చీడ, పీడల బెడద ఉండదన్నారు. జిల్లా ఉద్యావన శాఖ అధికారి సత్తార్ మాట్లాడుతూ అయిల్ ఫామ్ పంట సాగు కోసం రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ సాగుతో పాటు పత్తి, పెసర, మక్క, సోయా కూరగాయాలు , కందులు, మినుములు, జొన్న తదితర పంటలను అంతర పంటలుగా వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఇకోఫామ్ ఆయిల్ , యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సల్టెంట్ డీఎస్.రామ్, తాండూరు ఉద్యాన శాఖ అధికారి మల్లికార్జున్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, శాస్త్రవేత్త రంగరాజు, వ్యవసాయశాఖ జేడి గోపాల్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి సత్తార్

తాండూరు రెవెన్యూ డివిజన్‌కు ప్రత్యేక హోదా

- సబ్ కలెక్టర్ హోదాలో ఐఎఎస్ అధికారి నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- తాండూరు, కొడంగల్ పై ప్రత్యేక శ్రద్ధ



తాండూరు,మే 21 : తాండూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి ప్రత్యేక హోదా కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15రెవెన్యూ డివిజన్లకు సబ్‌కలెక్టర్ హోదాలో ఐఎఎస్ అధికారులను నియమించేలా పరిపాలన పరమైన వెసులుబాటును కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 15 రెవెన్యూ డివిజన్‌లలో వికారాబాద్ జిల్లాలోని తాండూరు రెవెన్యూ డివిజన్ కూడా ఉంది. దీంతో తాండూరు ఆర్డీవో కార్యాలయానికి సబ్ కలెక్టర్ హోదాలో ఐఎఎస్ అధికారిని నియమించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే కొడంగల్ నియోజకవర్గం కూడా తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వస్తుంది. త్వరలో ఐఎఎస్ అధికారిని ఈ రెవెన్యూ డివిజన్‌కు నియమించనున్నారు. ప్రస్తుతం ఆర్డీవో శ్రీనివాస్‌రావు కొనసాగుతున్నారు. హోదా పెంచడంతో ప్రస్తుత ఆర్డీవో శ్రీనివాస్‌రావు బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. ఈయన స్థానంలో ఐఎస్ అధికారిని నియమించనున్నారు. పరిపాలన పరంగా విస్తృత ఆధికారాలు, నిర్ణయాలు తీసుకునేందుకు నియమించే అధికాకారికి ప్రత్యేక అధికారాలుంటాయి. తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో తాండూరు పట్టణం, తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్, కొడంగల్ పట్టణం, కొడంగల్ , మద్దూర్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలున్నాయి. ప్రత్యేక హోదాతో మరిన్ని మండలాలు అధికారి పరిధిలోకి తెచ్చే అవకాశాలున్నాయి.

ట్రైనీ కలెక్టర్‌ను నియమించే ఛాన్స్

తాండూరు రెవెన్యూ డివిజన్‌కు ఐఎస్ హోదా కల్పించారు. ఈనేపథ్యంలో వికారాబాద్ జిల్లాలో ప్రస్తుతం శిక్షణ పొందుతున్న ట్రైనీకలెక్టర్ ఉమాహారతిని నియమించే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. వచ్చే వారం ఈ కార్యాలయానికి హోదా మార్పు చేసే అవకాశాలున్నాయి.

రెండు సెగ్మెంట్లపై ప్రత్యేక దృష్టి

తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టిని ప్రభుత్వం కేంద్రీకరించిన్నట్లు కనబడుతోంది. ప్రత్యేకంగా ఐఎఎస్ హోదాను కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంతో భూ సమస్యలు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించేందుకోసమేనని తెలస్తుంది.

దామర్‌చెడ్‌లో హ్యాండ్ బోర్ల మరమ్మతు

బషీరాబాద్, జూన్ 21: 'దామర్‌చెడ్‌లో తాగునీటి కష్టాలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు స్పందించారు. ఈమేరకు గ్రామ కార్యదర్శి నాగప్రసాద్‌తో ఆయన మట్లాడి వెంటనే మెకానిక్‌ను గ్రామానికి పంపించారు. కార్యదర్శి దగ్గరుండి రెండు చేతిపంపులను మరమ్మతు చేయించారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి చేతి పంపులు మరమ్మతు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం గ్రామానికి ఎంపీడీవో రాఘవులు, ప్రత్యేకాధికారి రమేష్ చేరుకుని బోరు మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం స్థానికులతో మట్లాడుతూ.. ఒకటి, రెండు రోజుల్లో గోరిగడ్డ వద్ద డైరెక్టు పంపింగ్ సిస్టం బోరుకు కొత్త మోటారుకు ఏర్పాటు చేయించి బీసీకాలనీకి నీటిసమస్యకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



హ్యాండ్‌బోరును మరమ్మత్తు చేయిస్తున్న నాగప్రసాద్

బోనఫైడ్ పంచాయితీపై విచారణ

- వివరాలు వెల్లడించిన కాంప్లెక్స్ హెచ్‌ఎం వైద్యనాథ్



పాఠశాలలో విచారణ జరుపుతున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం వైద్యనాథ్

తాండూరు రూరల్, జూన్ 21: మండలంలోని ఉద్దండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థి శరత్ బోనఫైడ్ విషయంపై పూర్తి విచారణ జరిపినట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం వైద్యనాథ్ అన్నారు. ఎంఈవో వెంకటయ్య ఆదేశాల మేరకు శుక్రవారం పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం వైద్యనాథ్ మాట్లాడుతూ.. ఉద్దండాపూర్ పాఠశాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి బీజే శరత్ బోనఫైడ్ సర్టిఫికెట్‌ను తండ్రి బీజే రాములు వారం రోజుల కిందట పాఠశాల నుంచి తీసుకెళ్లారు. పాఠశాలలోకి హెచ్‌ఎం రవీందర్‌కుమార్ శర్మ రానివ్వలేదు. దీంతో విద్యార్థి తండ్రి హెచ్‌ఎం మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయమై విద్యార్థి తండ్రి రాములు ఎంఈవోకు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాలతో శుక్రవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థి శరత్‌ను శనివారం నుంచి పాఠశాలలోకి అనుమతిస్తామని తెలిపారు. దీంతో ఈ బోనఫైడ్ పంచాయితీ ముగిసిందని తెలిపారు.

యాచారంలో మోస్తరు వర్షం

యాచారం, జూన్ 21 : యాచారం మండల కేంద్రంతో పాటు చౌదర్‌పల్లి, గున్‌గల్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి నందివనపర్తి, చిన్నతూండ్ల తదితర గ్రామాలలో శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది, ఈ వర్షం కారణంగా తడారిన పత్తి పంటలకు ప్రాణం పోసినట్లయింది. సుమారు గంట పాటు వర్షం కురిసింది.





ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో సూరజ్‌కుమార్

స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన

కడ్తాల్, జూన్ 21: కల్వకుర్తి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం(స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ) ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న కల్వకుర్తి ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు కడ్తాల మండలంలో శుక్రవారం కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ పర్యటించారు. కడ్తాల తహసీల్దార్ ముంతాజ్, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, సర్వే అధికారులతో కలిసి అన్మాస్‌పల్లి సమీపంలోని సర్వేనెంబర్ 260/29, 321లలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి? ఎవరైన రైతులు ప్రభుత్వ భూములు ఆక్రమించారా? అనే కోణంలో పరిశీలన చేశారు. సర్వే నెంబర్ 260/29లో సుమారు 80 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భూములకు సంబంధించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. డీఐలు కృష్ణయ్య, శ్రీనివాస్, సర్వేయర్ పాండురంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కడ్తాల మండలంలో ధరణి పోర్టల్‌కు సంబంధించి భూ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే వాటిని పరిష్కరించి ఇబ్బందులు తీర్చాలని ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆర్డీవో సూరజ్‌కుమార్‌ను కోరారు. అనేక మంది రైతుల పట్టా భూములు కూడా నిషేధిత జాబితాలో ఉండటంతో విక్రయించకుండా ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. కడ్తాల మండలంలో రెగ్యులర్ సర్వేయర్ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెంటనే సర్వేయర్‌ను నియమించాలన్నారు. స్పందించిన ఆర్డీవో సూరజ్‌కుమార్ పది రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, నాయకులు జహంగీర్‌అలీ, బాల్‌రాజ్, రవి, రాజేశ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

యాచారం, జూన్ 21 : విద్యార్థులు డ్రగ్స్ గంజాయికి దూరంగా ఉండాలని, అవి మనిషి జీవితాన్ని పాడు చేస్తాయని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఎస్సై ప్రసాద్ అన్నారు. శుక్రవారం మేడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ గంజాయి తీసుకుంటే కలిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాల క్రయ విక్రయాలపై సమాచారమందించాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రసాద్



డీఆర్‌ఎంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం

కొత్తూర్, జూన్ 21: మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌ను హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ వైష్ణోయ్ శుక్రవారం పరిశీలించారు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ నుంచి సమీపంలో ఉన్న సీఎంటీఎల్ గోదాం వరకు నిర్మించే నూతన రైల్వే లైన్‌ను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక రైల్వే అధికారులకు సూచన చేశారు. ఇదిలా ఉండగా, స్థానిక కాంగ్రెస్ నాయకులు డీఆర్‌ఎంను కలిసి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిన వినతిపత్రాన్ని అందజేశారు. కొత్తూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేగేట్ వద్ద ఆర్‌వోబీ లేదా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని లేఖలో పేర్కొన్నారు. కొత్తూర్ పాత రైల్వేగేట్ వద్ద మురుగునీరు నిలిచిపోతోందని, ప్రజలు ఇబ్బందులకు గురైతున్నారని, మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. డీఆర్‌ఎం స్పందిస్తూ అధికారులను పరిశీలన చేసేలా ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, కర్రోళ్ల సురేందర్, పెద్దిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



చిలుకూరు బాలాజీని దర్శించుకున్న ట్రైనీ ఐఏఎస్‌లు

మొయినాబాద్ మండలంలో ట్రెయినీ ఐఏఎస్‌ల సందర్శన

మొయినాబాద్ రూరల్, జూన్21: నగర శివారులోని మొయినాబాద్ మండలాన్ని ముగ్గురు ట్రెయినీ ఐఏఎస్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని అజీజ్‌నగర్, చిలుకూరు గ్రామ పంచాయతీలను పరిశీలించారు. జీపీ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామాల పరిధిలోని డంపింగ్ యార్డులు, నర్సరీల్లో మొక్కలను పరిశీలించారు. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ, పారిశుధ్య పనులపై ఆరా తీశారు. పరిపాలనపై అధికారులు మండల స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిలుకూరు బాలాజీ ఆలయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ట్రెయినీ ఐఏఎస్ అధికారులు జస్లీన్ కౌర్, అర్పిత్ గుప్తా, యాక్స్ చౌదరిలు పాల్గొన్నారు. వారితో జడ్పీ సీఈవో శ్రీ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఎల్పీవో సతీష్, ఎంపీడీవో సంధ్యారాణి, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మానసిక ప్రశాంతతకు యోగా అవసరం



కోర్టు ఆవరణలో యోగ చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

వికారాబాద్, జూన్ 21: మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కోర్టు ఆవరణలో శుక్రవారం జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జీ న్యాయమూర్తి డీబీ.శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, బార్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో యోగాడే

మేడ్చల్ టౌన్, జూన్ 21: యోగా డే సందర్భంగా శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో యోగా గురువు కే.శ్రీనివాసరావు ద్వారా ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని యోగ ఆసనాలు వేశారు. అనంతరం యోగా గురువు శ్రీనివాస రావును కళాశాల నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఆర్.లోకనాథం, ఎస్ఏసీ కన్వీనర్ శైలజారెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు హాజరయ్యారు.

ఇంజనీరింగ్ విభాగంలో కొత్త పరిశోధనలు చేయాలి

మేడ్చల్ టౌన్, జూన్ 21 : ఇంజనీరింగ్ విభాగంలో కొత్త పరిశోధనలు చేయాలని మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మ గూడ మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం సాఫ్ట్ కంప్యూటింగ్, సిగ్నల్ ప్రాసెసింగ్, ఇంటలిజెన్స్ మ్యానుఫాక్చరింగ్, ఎనర్జీ సస్టై స్టెబిలిటీపై రెండు రోజులపాటు చేపడుతున్న ప్రత్యేక ఈవెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధనల పాత్ర కీలకమన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో బోధించే అధ్యాపకుల పరిజ్ఞానం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సేయింట్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్, బోర్డు సభ్యుడు డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడి, కేఐఐటీ భువనేశ్వర్‌కు చెందిన ప్రొఫెసర్ సురేష్, మురత్ ఎరోగుల్, శాలిని రెడ్డి, డాక్టర్ వీఎస్‌కే రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.



విద్యార్థులు నిర్వహిస్తున్న నృత్య ప్రదర్శన

మూడు రోజులుగా రిజిస్ట్రేషన్లు బంద్

షాద్‌నగర్ రూరల్, జూన్21: షాద్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో మూడు రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. తహసీల్దార్ పార్థసారథి మూడు రోజుల నుంచి సెలవుపై వెళ్లడంతో భూముల రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్స్ బుక్ చేసుకున్న వారు పడిగాపులు కాస్తున్నారు. కలెక్టర్ కూడా అందుబాటులో లేకపోవడంతో తంబ్ ఇంప్రెషన్ మరొకరికి ఇవ్వలేదు. దూరప్రాంతాల నుంచి వచ్చిన కొనుగోలు, విక్రయదారులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మ జాతర



తాండూరు రూరల్, జూన్ 21: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని తాండూరు మండలం కొత్లాపూర్ గ్రామ శివారులో రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. గతనెల మే 23న జాతర ఉత్సవాలు ప్రారంభం కాగా నాలుగు మంగళవారాలు, ఐదు శుక్రవారాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈనెల 7న నిర్వహించి, రథోత్సవంతోపాటు సిడే కార్యక్రమాలను భక్తులను ఆకట్టుకుంది.శుక్రవారం ఆఖరు రోజు జాతర కావడంతో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆ తర్వాత నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లోఆలయ ఈవో శేఖర్‌గౌడ్‌తోపాటు మాజీ ఆలయం కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సాయిలు, గోపాల్, సిబ్బంది రవి పాల్గొన్నారు.



బోనాలతో వస్తున్న మహిళలు

అంగన్‌వాడీ టీచర్ల సేవలు ప్రశంసనీయం

యాచారం, జూన్ 21: అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు చిన్నపిల్లలను చేరదీసి విద్యాబోధన చేసి తీర్చిదిద్దడం అభినందనీయమని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా అన్నారు. శుక్రవారం యాచారంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రీప్రైమరీ స్కూల్‌పై నిర్వహించిన శిక్షణ శిబిరం ప్రారంభించారు. తమ సేవలను ప్రతీ కుటుంబానికి అందేటట్లు చర్యలు తీసుంటున్నామని సీడీపీవో శాంతిశ్రీ చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జంగమ్మ తదితరులున్నారు.


పూడూరు: మోడల్ స్కూల్‌లో యోగాడే అక్షరమాల



పరిగి: కోర్టు అవరణలో యోగాలో న్యాయాధికారి నాగుల శిల్ప, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


నవాబుపేట: కేజీబీవీ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు


శామీర్‌పేట: మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలు, పాఠశాలలు, తదితర చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి యోగాసనాలు చేశారు. విద్యార్థులకు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు.


తాండూరు రూరల్: సిరిగిరిపేట్ ప్రాథమికోన్నత పాఠశాలలో యోగాపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి


మేడ్చల్ టౌన్: యోగా డే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్


ఘట్‌కేసర్ రూరల్: అనురాగ్ యూనివర్సిటీలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు


దోమ: ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు


కొడంగల్: శ్రీ నేతాజీ విద్యాభవన్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


కీసర: రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు


వికారాబాద్: యోగా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్


తాండూరు: కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న న్యాయవాదులు


కీసర రూరల్: నాగారంలోని సెరినిటీ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


యాలాల: యోగ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బాలేశ్వరగుప్తా


ఘట్‌కేసర్: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో యోగాసాధన


బషీరాబాద్: యోగాసనాలు చేస్తున్న ఎంపీడీవో, ఏపీవో, స్థానిక నాయకుల


క్రైం కార్నర్

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 21: రైలుకింద పడి గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చర్లపల్లి -ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ మధ్య కేఎం 213/15 మైలురాయి వద్ద శుక్రవారం ఉదయం గుర్తుతెలియని రైలుకింద పడి గుర్తుతెలియని (30 నుంచి 35) వయసు గల వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి శరీర భాగాలు విడిగా పడటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 21: ఘట్‌కేసర్ పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్(40) అదృశ్యమైనట్లు ఆయన కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్ కొంతకాలంగా భార్యతో విడిగా ఉంటున్నాడు. ఈనెల 17న తన షిఫ్టుకారు తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. తన సోదరుడు గడ్డం విఠల్ ఫోన్‌చేసినా స్పందించలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారిని విచారించగా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో విఠల్ ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


గడ్డం మహేష్


శ్రీను

ఘట్‌కేసర్ రూరల్: జనగామ జిల్లా, రఘునాథపల్లి మండలం, పోతరాజు తండాకు చెందిన లకావత్ శ్రీను(34) తన భార్యతో విడిపోయి ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, దత్తాత్రేయనగర్ కాలనీలోని తన సోదరుడు రాజు వద్ద ఉంటున్నాడు. కాగా, ఈనెల 13వ తేదీన శ్రీను రాజు వద్ద కొన్ని డబ్బులు తీసుకొని ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రి అయినా తిరిగిరాలేదు. దీంతో రాజు బంధువులను, మిత్రులను, తెలిసిన వారిని విచారించినా శ్రీను అచూకీ లభ్యంకాలేదు. దీంతో అతడి సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

కులకచర్ల, జూన్ 21: విద్యుదాఘాతానికి ఓ గేదె మృత్యువాత పడిన ఘటన కులకచర్ల మండల కేంద్రంలో జరిగింది. కులకచర్ల గ్రామానికి చెందిన కాటన్‌పల్లి రాములు రోజు మాదిరిగా తన గేదెను శుక్రవారం పొలంలో మేత కోసం వదిలిపెట్టాడు. ఈ క్రమంలో మేత మేస్తున్న గేదె పొలంలో విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాతపడింది. మృత్యువాతపడిన గేదె విలువ దాదాపు 70వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

వర్షాలు కురవాలని మొక్కులు


సీతా మాతాకు పూజలు నిర్వహిస్తున్న కొటాలగూడ గిరిజనులు

వికారాబాద్, జూన్ 21: వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని గిరిజనుల ఆరాధ్యదైవం సీతా మాతకు ప్రత్యేక పూజలు చేసినట్లు కోటాలగూడ గిరిజనులు తెలిపారు. ప్రతీ సంవత్సరం జూన్ మాసంలో శుక్రవారం పుడూర్ మండలం గొంగుపల్లిలో ఉన్న గిరిజనుల ఆరాధ్యదైవం సీతా మాతకు వికారాబాద్ మండలం కోటాలగూడ గ్రామంలోని గిరిజనులు ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో భాగంగానే శుక్రవారం సీతా మాతకు కోటాలగూడ గిరిజనులు పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో కోటాలగూడ గిరిజనులు 500 మంది పాల్గొన్నారు.

యువతి ప్రాణాలు కాపాడిన రైల్వే పోలీసులు

వికారాబాద్, జూన్ 21: రైలు పట్టాలపైన ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన యువతిని ఆర్‌పీఎఫ్ పోలీసులు కాపాడారు. ఈ సంఘటన వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి రైల్వే ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలానికి చెందిన ఓ యువతి జీవితంపై విరక్తి చెందిన వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ప్రేమించిన వ్యక్తి పెళ్లికి ఒప్పుకోవడం లేదని మనస్థాపం చెంది ఈ ఆఘాయిత్యానికి ఒడిగట్టింది. ఈసమయంలో విధుల్లో ఉన్న పోలీసులు గుర్తించి యువతిని కాపాడినట్లు తెలిపారు.యువతికి కౌన్సెలింగ్ ఇవ్వగా యువతి కొత్త ఉత్సహంతో మళ్లీ మీవద్దకు ఆర్‌పీఎఫ్ ఉద్యోగిగా వస్తానని వారికి సమాధానం చెప్పడం కొసమెరుపు. అయితే అమ్మాయిని సఖీ కేంద్రానికి రైల్వే పోలీసులు తరలించారు.

శేషురాంకు నేతల పరామర్శ



మేడ్చల్ టౌన్: దొంగల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మేడ్చల్ జగదాంబా జువెల్లరీ షాపు యజమాని శేషురాంను శుక్రవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌లు పరామర్శించారు. పట్టపగలు ఇలాంటి ఘటన జరగడంపట్ల విచారం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇటీవల మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలోని హనుమాన్ గుట్టపై ఉన్న సీతారాముల వారి ఆలయంలో విగ్రహాలు ధ్వంసం కాగా, అట్టి ఆలయాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ సందర్శించారు. హిందూ ఆలయాల జోలికి వస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


వికారాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, తదితరులు

వికారాబాద్, జూన్ 21 : తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ ఎంతో కీలక భూమిక పోషించారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్ఎంఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం తాండూరులోని ఇంద్రాచౌక్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. టీజేఎస్, లెక్చరర్ల ఫోరం, తెలంగాణ విద్యావంతుల వేదిక, ప్రజాసంఘాలు, ఆర్టీసీ జేఏసీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో టీజేఎస్ ఇన్‌చార్జి సోమశేఖర్, టీజేఏసీ సలహాదారుడు రంగారావు, సిఐటీయు నాయకులు శ్రీనివాస్, విద్యావంతుల వేదిక ప్రతినిధి పర్యాదరామకృష్ణ, లెక్చరర్ ఫోరం నాయకులు వీరేశం, పీడీఎస్‌యూ జిలా అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు నివాళులర్పించగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ దీపా నర్సింహులు, జిల్లా గ్రంథాలయ మాజీచైర్మన్ రాజుగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ చారి, కౌన్సిలర్ సంగీత ఠాకూర్ నివాళ్లు అర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో వీరమణి, ముజీబ్, వాజీద్, భాను తదితరులు జయశంకర్‌కు నివాళులర్పించారు. తాండూరు మున్సిపాలిటీలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మున్సిపల్ సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా విద్యావంతుల వేదిక నాయకులు అధికారులతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, గొరారం గోపాల్, అనిల్‌కుమార్, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు బాబాయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్ టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శుక్రవారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి ఆధ్వర్యంలో యశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, నాయకులు రాజమల్లారెడ్డి పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి

ఏరువాక పౌర్ణమి వేడుకలు

వికారాబాద్ జిల్లాలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రైతులు పాడి పశువులకు ఉదయాన్నే స్నానాలు చేయించి, రంగురంగులతో అలంకరించారు. అనంతరం గ్రామాల్లో ఊరేగించారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.


కొడంగల్‌లో కాడెడ్లను ముస్తాబు చేసి ఊరేగిస్తున్న రైతులు


ధారూరులో కాడెడ్ల ఊరేగింపు


పూడూరు: కంకల్‌లో ఆలయం చుట్టూ ఎడ్లబండితో ప్రదక్షిణ చేస్తున్న రైతులు


పరిగి: మండలం రాఘవాపూర్‌లో ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు


పెద్దేముల్: మంబాపూర్ గ్రామంలో ఎడ్లకు ఉల్లిగడ్డ, పచ్చిపసుపు తినిపిస్తున్న రైతులు

సంక్షిప్తంగా..

- **బషీరాబాద్:** మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బషీరాబాద్ ఎంపీపీ కరుణ అజయ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు)లోని భవనంలో కళాశాల ప్రారంభమైందన్నారు.
- **కొడంగల్:** హస్నాబాద్ గ్రామానికి చెందిన అల్వాల్ సాయికిరణ్ ఇటీవలే ఛత్తీస్‌గడ్‌లో జరిగిన జాతీయస్థాయి షాట్‌పుట్‌లో గోల్డ్‌మెడల్ సాధించాడు. హైదరాబాద్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సాయికిరణ్‌ను సీఎం అభినందించారు.
- **మర్పల్లి:** ప్రజల ప్రయాణ సౌకర్యార్థం పంచలింగాల గ్రామానికి తిరిగి బస్సును ప్రారంభించినట్లు మర్పల్లి సొసైటి చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, నాయకులు రాములు తెలిపారు. శుక్రవారం పంచలింగాల గ్రామానికి బస్సు చేరడంతో గ్రామస్థులు డప్పుల చప్పుళ్ల మధ్య గ్రామానికి బస్సును ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.
- **కులకచర్ల:** పీరంపల్లిలో నూతన సీఎస్‌పీ పాయింట్‌ను ఎస్ఐ అన్వేష్‌రెడ్డి, ఎస్బీఐ జనరల్ మేనేజర్ శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాధిక, సోమలింగం పాల్గొన్నారు.
- **తాండూరు రూరల్:** తాండూరు మండలం జినుగుర్తి సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ కాలేజీలో శుక్రవారం జిల్లా పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.
- **బషీరాబాద్:** ఈ నెల 23న వికారాబాద్‌లోని గౌలికర్‌పంక్షన్ హాలులో నిర్వహించే జాబ్‌మేళాను మండల నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు తెలిపారు.యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు హాజరై ఉద్యోగాలు పొందలన్నారు. ఈ మేళాలో 60కంపెనీల ప్రతినిధులు హాజరై వివిధ కంపెనీల్లో 5వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ఆయన వివరించారు.
- **బొంరాస్‌పేట్:** కల్తీ ఎరువులు, విత్తనాల అమ్మకాలపై ఉక్కుపాదం మోపేందుకు ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి అనురాధ తెలిపారు. మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు.
- **దోమ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించినట్లు ప్రిన్సిపల్ మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు రూ.1500 నుంచి రూ.2000 విలువ గల పుస్తకాలకు విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించినట్లు తెలిపారు.
- **బషీరాబాద్:** నవాంద్గీ గ్రామంలో కుర్వశానప్ప గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి అంత్యక్రియలకు స్థానిక యువకుడు వేణు పట్వారీ రూ.5వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, భీంరెడ్డి పాల్గొన్నారు.
- **వికారాబాద్:** విద్యుత్ శాఖలో శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ పేరిట చేసిన వివిధ కాంట్రాక్టు పనులకు సంబంధించి రూ.3.50కోట్లకు పైగా బిల్లులు తనకు చెల్లించాల్సి ఉండగా, చెల్లింపులు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆ సంస్థ యజమాని శివదర్శన్ ఆరోపించారు. తాను చేసిన కాంట్రాక్టు పనులకు సంబంధించిన డబ్బులను ఇప్పించాలని కోరుతూ ఆయన శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్ఈ, డీఈ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి సంస్థను బ్లాక్ లీస్ట్ నుంచి తొలగించి తనకు రావాల్సిన డబ్బులు తనకు ఇప్పించి న్యాయం చేయాలని శివదర్శన్ వారికి విజ్ఞప్తి చేశారు.
- **ఘట్‌కేసర్ రూరల్:** జిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదామని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ప్రతాప్‌సింగారంలో శుక్రవారం రూ.50లక్షల జిల్లా పరిషత్ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జడ్పీచైర్మన్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.
- **తాండూరు:** తాండూరు పట్టణంలో శుక్రవారం వరణ్య ఆర్ట్ క్రియేషన్ ఆధ్వర్యంలో రౌడీ బేబి సినిమా షూటింగ్‌ను నిర్వహించారు. చికెన్ యాదవరెడ్డికి చెందిన ఫాంహౌస్‌లో ఋూ షూటింగ్‌కు ప్రముఖ వ్యాపారవేత్తలు పటేల్ వీరేందర్, హైడ్రామి శివకుమార్ క్లాప్ కొట్టారు. ఈ సినిమాకు నిర్మాతగా డి.రాజు వ్యవహరిస్తుండగా వంశీ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. లేడీ ఓరియంటెడ్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాను చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి విడతల వారీగా అభివృద్ధి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, జూన్ 21: గ్రామాల అభివృద్ధికి విడతల వారీగా అభివృద్ధి పనులు చేపడతామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. ప్రారంభించిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జులై నుంచి ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. ముజాహిద్‌పూర్, కులకచర్ల మీదుగా పాలమూర్‌కు బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. వ్యవసాయ సమీక్షలో ఏవో వీరస్వామి నివేదిక చదివి వినిపించారు. విద్యాశాఖ సమీక్షలో ఎంఈవో హబీబ్ అహ్మద్ నివేదిక చదివి వినిపించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ రాందాస్‌నాయక్, ఎంపీడీవో రామకృష్ణనాయక్, తహసీల్దార్ మురళీధర్, ప్రభు, ఎంపీవో కరీం పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

వికారాబాద్/బంట్వారం (కోట్‌పల్లి), జూన్ 21: అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోట్‌పల్లి మండలం ఎన్నారం గ్రామానికి చెందిన రామయ్యకు చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ సహాయ నిధిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అందజేశారు. శుక్రవారం ఆయన నివాసంలో కుటుంబసభ్యులకు రూ.లక్షా 10వేలు విలువగల ఎల్‌వోసీని అందజేశారు.

కీసర సీఐగా సీతారాం

కీసర రూరల్, జూన్ 21 : కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా సీతారాం నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన వెంకటయ్య సైబర్ క్రైం విభాగానికి బదిలీ కాగా, చౌటుప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన సీతారాం కీసర సీఐగా నియామకమయ్యారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వికారాబాద్, జూన్ 21: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. మునిసిపల్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం సీజినల్ వ్యాధులు నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా లాంటి పరిసరాలు శుభ్రంగా ఉండేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆర్పీలు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, ప్రోగ్రామ్ ఆఫీసర్ రవీంద్ర యాదవ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నిఖిల్, డాక్టర్ కృప, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రకాశ్, ఇన్‌చార్జి ఎస్ఐ ఏసుదాసు, మెడికల్ అధికారులు, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు, ఆర్పీలు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

బషీరాబాద్, జూన్ 21: మండల కేంద్రంలో రూ.కోటీ 50లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులు తుది దశకు వచ్చాయి. ఆలయ నిర్మాణ పనులు నిధుల కొరతతో నిలిచిపోవడంతో కమిటీ నిర్వాహకులు దాతల కోసం అన్వేషిస్తున్నారు. మండలంలో రెడ్డిఘణాపూర్ గ్రామానికి చెందిన తలారిగోపాల్ రూ.18వేల నగదును ఆలయ కమిటీ చైర్మన్ సాయిల్‌గౌడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు వడ్డేశ్రీను, పవాన్‌ఠాగూర్, వడ్డే ఉల్లప్ప, డి.మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా రామస్వామి

మేడ్చల్ టౌన్, జూన్ 21: ముదిరాజ్ సంఘం జిల్లా యువజన విభాగం నూతన అధ్యక్షునిగా మేడ్చల్‌కు చెందిన దుబ్బా రామస్వామిని నియమించారు. ఈ మేరకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్ శుక్రవారం రామ స్వామికి నియామక పత్రాన్ని అందజేశారు.

అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి పనులు పూర్తిచేయాలి


సౌత్‌సెంట్రల్ డివిజినల్ ఇంజినీర్ జగదీష్‌కు వినతి సమర్పిస్తున్న గౌడవెల్లి నేతలు

మేడ్చల్ టౌన్, జూన్, 21: మేడ్చల్ మండలంలో గౌడవెల్లి గ్రామంలో అమృత్ భారత్ కింద చేపడుతున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు సౌత్‌సెంట్రల్ రైల్వే డివిజినల్ ఇంజినీర్ జగదీష్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. నత్తనడకన కొనసాగుతున్న బ్రిడ్జి పనుల కారణంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. కాగా సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఇంజినీర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.